సాక్షి గుంటూరు

శుక్రవారం । 16 । ఆగస్టు । 2024




పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులో నీటి నిల్వ గురువారం సాయంత్రానికి 44.20 టీఎంసీలకు చేరింది. దిగువకు 25,399 క్యూసెక్కులు వదిలారు.



నోటు పుస్తకాలు పంపిణీ

నిజాంపట్నం: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం శివపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు తహసీల్దార్ షాకీర్ పాషా నోట్‌బుక్స్ పంపిణీ చేశారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 7026 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాలువకు 2860 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

డీసీఎంఎస్ పాయింట్ల ద్వారా విత్తనాలు, ఎరువులు



కొరిటిపాడు(గుంటూరు): డీసీఎంఎస్ పాయింట్ల ద్వారా రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ తేజ సూచించారు. గుంటూరు జిల్లా కో–ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(జీడీసీఎంఎస్) కార్యాలయంలో 78వ స్వాతంత్య్ర వేడుకలను గురువారం నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ తేజ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. భార్గవ తేజ మాట్లాడుతూ ఎందరో మహనీయుల త్యాగాల ఫలితమే ఈ స్వాతంత్య్ర దినోత్సవం అన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ డి.హరిగోపాలం, కార్యాలయం మేనేజర్ కె.శ్రీనివాసరావు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

వీరుల త్యాగఫలమే స్వాతంత్య్రం

కలెక్టర్ వెంకట మురళి



బాపట్ల: వీరుల త్యాగఫలమే మనం ఇప్పుడు అనుభవిస్తున్న స్వాతంత్య్రమని కలెక్టర్ జె.వెంకట మురళి చెప్పారు. 78వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా గురువారం కలెక్టరేట్‌పై జాతీయ జెండాను కలెక్టర్ ఎగురవేశారు. త్రివర్ణ పతాకానికి ఆయన వందనం చేశారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. మహనీయుల త్యాగాల స్ఫూర్తితో ప్రభుత్వ యంత్రాంగం పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ బి.సుబ్బారావు, జిల్లా రెవెన్యూ అధికారి సి.హెచ్.సత్తిబాబు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి ఆటల పోటీలు

నరసరావుపేట ఈస్ట్: విద్యాభారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్‌లో భాగమైన సరస్వతి శిశు మందిర్ విద్యాసంస్థల రాష్ట్రస్థాయి ఆటల పోటీలు ఈనెల 17, 18 తేదీలలో నిర్వహిస్తున్నట్టు పాఠశాల సమితి అధ్యక్షుడు మిరియాల నాగప్రసాదరావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఐదు జోనల్స్‌లో గెలుపొందిన దాదాపు 700మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. పోటీలను ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాల క్రీడామైదానంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. పోటీలలో ప్రథమ స్థానం సాధించిన క్రీడాకారులు సౌత్ సెంట్రల్ పోటీలకు, అక్కడ విజయం సాధించిన వారు జాతీయస్థాయి పోటీలకు ఎంపికవుతారనీ, జాతీయ స్థాయిలో విజయం సాధించిన వారు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

కిటకిటలాడిన ఆర్టీసీ బస్టాండ్



నరసరావుపేట ఈస్ట్: వరుస సెలవులు రావటంతో సొంత గ్రామాలకు వెళ్లే విద్యార్థులతో నరసరావుపేట బస్టాండ్ కళకళలాడింది. స్వాతంత్య్ర దినోత్సవం, వరలక్ష్మీ వ్రతం, వీకెండ్స్, రాఖీ పూర్ణిమ ఇలా వరుసగా సెలవులు రావటంతో విద్యార్థులు ఉత్సాహంగా సొంత గ్రామాలకు తరలివెళ్లారు. వీరికి తోడు వివిధ కారణాలతో గ్రామాలకు వెళ్లే ప్రయాణికులతో ఆర్టీసీ బస్సులు కిటకిటలాడాయి.

నేడు భ్రమరాంబకు పసుపు కొమ్ములతో అలంకరణ

పెదకాకాని: పెదకాకానిలోని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో శ్రావణమాసం రెండో శుక్రవారం పురస్కరించుకుని భ్రమరాంబ అమ్మవారిని పసుపు కొమ్ములతో ప్రత్యేకంగా అలంకరించనున్నట్లు ఉప కమిషనర్ దాసర శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో దేవస్థానానికి విచ్చేసి భ్రమరాంబ అమ్మవారిని ప్రత్యేక అలంకారంలో దర్శించుకోవాలని కోరారు. శ్రావణమాస మూడో శుక్రవారం భ్రమరాంబ అమ్మవారికి ప్రత్యేకంగా మల్లెపూల అలంకరణ, నాల్గవ శుక్రవారం లక్ష గాజులతో శ్రీ భ్రమరాంబ అమ్మవారిని ప్రత్యేక అలంకరిస్తామని తెలిపారు.

జన తిరంగా జయహే

- అనవసర నిబంధనలతో పథకాలకు కోత వేయం
- గుంటూరులో భూగర్భ డ్రెయినేజీ త్వరలో పూర్తి చేస్తాం
- మంగళగిరి–తాడేపల్లిలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ
- మంగళగిరిలో జ్యూయలరీ పార్కు, వీవర్స్ క్లస్టర్ ఏర్పాటు
- స్వాతంత్య్ర వేడుకల్లో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ వెల్లడి

సూపర్ సిక్స్ హామీలకు కట్టుబడి ఉన్నాం : లోకేష్

ముప్వన్నెల మెరిసింది. ఊరూవాడా దేశభక్తితో ఉప్పొంగింది. స్వాతంత్య్ర స్ఫూర్తి వెల్లివెరిసింది. జాతీయ జెండా సగర్వంగా రెపరెపలాడింది. జయహో భారత్ అంటూ నినదించింది. గుంటూరు జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో స్వాతంత్య్ర దిన వేడుకలు అట్టహాసంగా జరిగాయి. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సూపర్ సిక్స్ హామీలకు కట్టుబడి ఉన్నామని, షరతుల్లేకుండా, కోతల్లేకుండా వాటిని అమలు చేస్తామని రాష్ట్ర మంత్రి నారా లోకేష్ వెల్లడించారు.



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న మంత్రి నారా లోకేష్ చిత్రంలో కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవతేజ, ఎస్పీ సతీష్ కుమార్, (ఇన్‌సెట్‌లో) ప్రసంగిస్తున్న మంత్రి నారా లోకేష్

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల అమలుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ చెప్పారు. 78వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా గుంటూరు పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో మంత్రి జాతీయ జెండాను ఆవిష్కరించారు. జిల్లా ప్రజలనుద్దేశించి లోకేష్ మాట్లాడుతూ 'చంద్రబాబు హామీలకు షరతులు ఉండవు. అనవసర నిబంధనలతో సంక్షేమ పథకాలకు కోత విధించం, ఏడాదికి రూ.250 పెంచడం కాదు.. ఒకేసారి వెయ్యి రూపాయలు పెంచి రూ. 4 వేల పెన్షన్ అమలు చేస్తున్నామంటూ చెప్పుకొచ్చారు. మెగా డీఎస్సీ ప్రకటించి 16,347 టీచర్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నామని, తల్లికి వందనం పథకాన్ని అమలుచేస్తామని, ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి ఇస్తామని పేర్కొన్నారు. యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే తమ లక్ష్యమని, మహిళలకు త్వరలోనే ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం కాబోతుందని వెల్లడించారు. పేద వాడి ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లు ప్రారంభవుతున్నాయని, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, ప్రతి మహిళకు నెలకు రూ.1,500, ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేల సాయం అందిస్తామని పేర్కొన్నారు. చేనేత వస్త్రాలకు జీఎస్టీ రద్దుపై కేంద్రంతో చర్చిస్తున్నామని లోకేష్ చెప్పారు.

రైతులకు అండగా ఉంటాం

రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన ప్రజా ప్రభుత్వం రైతులకు అన్నివిధాలా అండగా నిలుస్తోందని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. జిల్లాలో 92,000 హెక్టార్లలో సాగవుతున్న వివిధ పంటలను ఈ–పంట యాప్ ద్వారా నమోదు చేశామని వెల్లడించారు. ఇప్పటివరకు 4,488 క్వింటాళ్ల నాణ్యమైన విత్తనాలు, 22,754 టన్నుల ఎరువులు సరఫరా చేసినట్టు చెప్పారు. గుంటూరు, తెనాలి, దుగ్గిరాల మార్కెట్ యార్డుల్లో జూలై చివరికి 35,186 మంది రైతులు 3,46,017 క్వింటాళ్ల పంటలను ఈ–నామ్ ద్వారా విక్రయించారని పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్లో జిల్లాలో 2 లక్షల ఎకరాల ఆయకట్టుకు 24 టీఎంసీల సాగునీరు అందించేలా ప్రణాళికను సిద్ధం చేశామన్నారు. గుంటూరు చానల్ ఆధునీకీకరణ పనులకు రూ.652 కోట్లు మంజూరు చేశామని, జిల్లాలో పెండింగ్‌లో ఉన్న తొమ్మిది లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. గుంటూరు మెడికల్ కాలేజీలో రూ.40 కోట్లతో పనులు జరుగుతున్నాయని, మంగళగిరి ఎయిమ్స్‌లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. ఉపాధి హామీ పథకంలో ఈ యేడు 29 లక్షల పనిదినాల కల్పన లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. గుంటూరు నగరపాలకసంస్థ పరిధిలో రూ.903 కోట్లతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు త్వరలో పూర్తిచేస్తామన్నారు. మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో భూగర్భ డ్రెయినేజీ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. మంగళగిరిలో జ్యూయలరీ పార్కు, వీవర్స్ ఫౌండేషన్ క్లస్టర్ ఏర్పాటు చేస్తామన్నారు. నల్లపాడు–బీబీనగర్ స్టేషన్ల మధ్య ట్రాక్ డబ్లింగ్‌ను, అమరావతి మీదుగా ఎర్రుపాలెం నంబూరు స్టేషన్ల మధ్య కొత్తగా నిర్మించే రైల్వే బ్రాడ్ గేజ్ లైన్‌ని కేంద్రం ప్రత్యేక ప్రాజెక్టుగా ప్రకటించిందని లోకేష్ చెప్పారు.



వేదికపై నుంచి ఆహూతులకు నమస్కరిస్తున్న మంత్రి నారా లోకేష్ చిత్రంలో ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గళ్ళా మాధవి, బూర్ల సీతారామాంజనేయులు, ఎమ్మెల్సీలు లక్ష్మణరావు, చంద్రగిరి ఏసురత్నం, అనూరాధ



జాతీయ పతాకాలతో విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

అనంతరం జరిగిన వివిధ విభాగాల శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది. ఉత్తమ శకటాలకు అవార్డులు వరించాయి. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను మంత్రి లోకేష్ పరిశీలించారు. అనంతరం జిల్లాలో ఉత్తమ సేవలందించిన అధికారులకు అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

తడబడిన లోకేష్

స్వాతంత్య్ర దినోత్సవ ప్రసంగంలో మంత్రి లోకేష్ తన సహజనైజాన్ని మరోమారు చాటుకున్నారు. పలుమార్లు తడబడ్డారు. నాలుక మడతేశారు. ప్రసంగపాఠాన్ని పూర్తిగా చదవకుండా తనకు అనుకూలంగా ఉన్న వరకూ మాత్రమే వల్లెవేశారు. ఉద్యానవన పంటలకు బదులుగా ఉద్యమం పంటలు అని చదివారు. ఆగస్టు ఒక్క నెలలోనే రూ.111 కోట్లకు బదులుగా నూటపదకొండు రూపాయలు పెన్షన్ ద్వారా అందించామని చెప్పారు. జాతీయ ఉపాధిహామీ పథకానికి 29 లక్షల పని దినాలను నిర్దేశించామని చెప్పడానికి బదులుగా 29 పని దినాలు కల్పించబోతున్నామని చదివారు. ఎస్సీ, ఎస్టీ సోదరులు అని చదవడానికి ఎస్సీ చౌదరులు అని చదివారు.

జ్ఞాన'జ్యోతి'

- అద్దంకి ఆణిముత్యం జ్యోతి చంద్రమౌళి మాస్టారు
- చారిత్రక పరిశోధన రత్నగా పేరుప్రఖ్యాతులు
- శాసనాల పరిశోధన, గ్రంథ రచన, తాళపత్ర గ్రంథాల అధ్యయనం ఖ్యాతి
- ఎన్నో అవార్డులు, సత్కారాలు, సన్మానాలు

అద్దంకి: విద్వాన్ జ్యోతి చంద్రమౌళి.. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పరిచయం అక్కర్లేని పేరు. ఇంటిపేరుకు తగ్గట్టే ఆయన నిత్యం ప్రకాశించే 'జ్యోతి'. చారిత్రక, పురావస్తు పరిశోధకుడిగా కీర్తి గడించిన ఈయన బాపట్ల జిల్లా అద్దంకి మండలంలోని బొమ్మనంపాడు అనే కుగ్రామంలో జన్మించారు. తెలుగు ఉపాధ్యాయునిగా ప్రస్థానాన్ని ప్రారంభించి 24 ఏళ్లపాటు పనిచేశారు. ఉద్యోగ విరమణ తర్వాత చారిత్రక, పురావస్తు పరిశోధకుడిగా మారారు. ప్రస్తుతం అద్దంకి రామనగర్‌లో నివాసం ఉంటున్నారు. రచయితగానూ గుర్తింపు సాధించారు. అనేక ప్రాంతాల్లో పర్యటించి పురాతన గ్రంథాలు, వస్తువులు గుర్తించి అధ్యయనం చేశారు. ఆలయాల్లో, తవ్వకాల్లో లభించిన శాసనాలను క్షుణ్ణంగా పరిశీలించి లిపిని అర్థం చేసుకుని కొత్త ప్రతులను తయారు చేశారు. తాళపత్ర గ్రంథాలను సేకరించి పుస్తక రూపం ఇచ్చారు. కొత్త విషయాలు తెలిస్తే పురావస్తు శాఖకు సమాచారం ఇస్తున్నారు. ఇప్పటికి ఈయన 30 శాసనాలను, ఏడు బౌద్ధ స్థూపాలను గుర్తించారు. పది తాళపత్ర గ్రంథాలకు పుస్తక రూపం ఇచ్చారు. జానపద కళలకు జీవం పోసేందుకు కృషి చేస్తున్నారు. ప్రస్తుతం జానపద కళాపీఠం ప్రధాన కార్యదర్శిగా, ప్రకాశం జిల్లా పరిశోధనా సంస్థ అధ్యక్షుడిగా, ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ లైఫ్ మెంబర్‌గా, ఏపీ గ్రాఫికల్ సొసైటీ ఆఫ్ ఇండియా మెంబర్‌గా, మైసూరు ఆలిండియా థీయో బౌద్ధ ఆర్గనైజేషన్ కార్యవర్గసభ్యుడిగా, ధర్మ చక్ర ఫౌండేషన్ అధ్యక్షుడిగా సేవలందిస్తున్నారు.

చంద్రమౌళి రచనలు

అద్దంకి చరిత్ర, సృజన, సూక్తి కిరణాలు, స్ఫూర్తి రత్నాలు, నేటి భారతం, ప్రకాశం జిల్లా చరిత్ర, దళిత కిరణాలు, జానపద కళలు, మాండుకేశ్వర చరిత్ర, ప్రకాశం జిల్లాలో దర్శనీయ స్థలాలు, అద్దంకి సీమ చరిత్ర, తెలుగు నిఘంటువుతోపాటు 26 గ్రంథాలను రచించారు.

పొందిన అవార్డులెన్నో..

చంద్రమౌళి గతంలో జిల్లా, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందారు. అధికార భాషా సంఘ ప్రతిభా పురస్కారం, ఉత్తమ రచయితగా, ఉత్తమ పరిశోధకునిగా, రెండు సార్లు ప్రకాశం జిల్లా విశిష్ట వ్యక్తిగా గౌరవాలను స్వీకరించారు. మద్రాసులోని ఆంధ్ర కళాసమితి ఉగాది సత్కారం, భారతీయుడు, పరిశోధనా భాస్కర, మద్రాసులోని కల్చరల్ సెంటర్ ఆఫ్ విజయవాడ, అమరావతి వారిచే చారిత్రక పరిశోధనా రత్న, జానపద కళానిధి వంటి ఎన్నో అవార్డులు, సన్మానాలు అందుకున్నారు.



మణికేశ్వరం వద్ద రాతి సమాధిని పరిశీలిస్తున్న చంద్రమౌళి (పాత చిత్రాలు)



తాళపత్రాలను పరిశోధిస్తున్న చంద్రమౌళి



త్రివర్ణ సాగరం

విజయపురిసౌత్: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా గురువారం నాగార్జున సాగర్ డ్యాం త్రివర్ణ శోభితమైంది. ప్రత్యేక దీపాలు అమర్చడంతో జలాశయం త్రివర్ణ కాంతులు వెదజల్లుతూ పర్యాటకులను ఆకట్టుకుంటోంది. జలాశయం రెండు రేడియల్ క్రస్ట్‌గేట్లు ఎత్తి దిగువ కృష్ణానదిలోకి 16,200 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సస్పెన్షన్

- ఆరోగ్యసిబ్బందిపై డీఎంహెచ్ఓ ఆగ్రహం
- 'మంచం పట్టిన ముత్తాయపాలెం' కథనానికి స్పందన
- ప్రతి ఇంటికెళ్లి రక్త నమూనాలు సేకరణ
- గ్రామాన్ని సందర్శించిన డీపీఓ రవికుమార్

సాక్షి ఎఫెక్ట్

బాపట్లటౌన్: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సస్పెండ్ చేస్తామని డీఎంఅండ్‌హెచ్‌ఓ ఎస్.విజయలక్ష్మి ఆరోగ్య సిబ్బందిని హెచ్చరించారు. సాక్షిలో 'మంచం పట్టిన ముత్తాయపాలెం' శీర్షికన ప్రచురించిన కథనానికి గురువారం డీఎంఅండ్‌హెచ్‌ఓ స్పందించారు. వైద్యశిబిరం నిర్వహించాలని ఆరోగ్యసిబ్బందిని ఆదేశించారు. దీంతో గురువారం ఉదయం మెడికల్ క్యాంపు నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికెళ్లి వైద్యపరీక్షలు చేశారు. రక్త నమూనాలను సేకరించి నివేదికల కోసం ల్యాబ్‌కు పంపించారు. గురువారం సాయంత్రం మెడికల్ క్యాంప్‌ను సందర్శించిన డీఎంఅండ్‌హెచ్‌ఓ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఊరంతా జ్వరాలు ఉంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రతిరోజూ 20 గృహాలను సందర్శించాలని ఆదేశిస్తే ఎందుకు పాటించడం లేదని నిలదీశారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని పేర్కొన్నారు. జ్వరాలు పూర్తిగా తగ్గేవరకూ ముత్తాయపాలెంలో వైద్యశిబిరం నిర్వహించాలని ఆదేశించారు.

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు

ముత్తాయపాలెం గ్రామాన్ని జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) వి.రవికుమార్ గురువారం సందర్శించారు. సిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించారు. తాగునీటి నమూనాలు సేకరించి పరీక్షలకు పంపాలని సూచించారు. పారిశుద్ధ్యం మెరుగుపరచాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి టి.వెంకటేశ్వర్లు, మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ ఎండీ షఫీ, వైద్యాధికారి గోపి, ఈఓపీఆర్డీ శరత్‌బాబు, పంచాయతీ కార్యదర్శి ఝాన్సీలక్ష్మి, ఏఎన్ఎం రూతు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.



ఆరోగ్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ విజయలక్ష్మి



ముత్తాయపాలెం గ్రామస్తులతో మాట్లాడుతున్న డీపీఓ రవికుమార్

ముగిసిన జేఎన్‌వీ హ్యాండ్‌బాల్ పోటీలు

ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన వైజాగ్

చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు: దేశం గర్వించదగ్గ క్రీడాకారులుగా విద్యార్థులు ఎదగాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆకాంక్షించారు. పల్నాడు జిల్లా పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయంలో మూడు రోజులు నిర్వహించిన ప్రాంతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు బుధవారంతో ముగిశాయి. మద్దిరాల జేఎన్‌వీ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు అధ్యక్షతన క్రీడా పోటీల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పుల్లారావు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడారంగంపై కూడా ఆసక్తి చూపాలన్నారు. యూబీఐ నరసరావుపేట రీజియన్ హెడ్ టి.మాధురి మాట్లాడుతూ క్రీడలు శారీరక దారుఢ్యాన్ని పెంపొందిస్తాయన్నారు. ధనలక్ష్మి గ్రూప్స్ డైరెక్టర్ సాధినేని హనుమంతరావు, జేఎన్‌వీ విశ్రాంత సహాయక సంచాలకులు సి.ప్రభాకరరెడ్డి, యూబీఐ మేనేజర్ రోహిత్‌సిన్హా, డాక్టర్ రాజశేఖర్‌లు మాట్లాడారు. అనంతరం ప్రాంతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ రత్నాంబిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైజాగ్ జేఎన్‌వీకి ఓవరాల్ చాంపియన్‌షిప్

జవహర్ నవోదయ విద్యాలయాల పరిధిలో నిర్వహిస్తున్న ప్రాంతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఓవరాల్ చాంపియన్ షిప్ టైటిల్‌ను విశాఖపట్నం జేఎన్‌వీ సాధించింది. క్యాలికట్, కోలార్, మహబూబ్‌నగర్, నెల్లూరు, రాయచూర్, విశాఖపట్నం, షిమోగా, త్రిశూల్ ప్రాంతాలకు చెందిన 430 మంది క్రీడాకారులు పాల్గొని హోరాహోరీగా తమ ప్రతిభా నైపుణ్యాలను చాటారు.

అండర్–14, అండర్ –17, అండర్ –19 విభాగాల్లో బాలురు, బాలికలకు వేర్వేరుగా ప్రతిరోజు 12 మ్యాచ్‌ల చొప్పున పోటీలను నిర్వహించారు. ఆయా పోటీల్లో రాష్ట్రానికి చెందిన విశాఖపట్నం జేఎన్‌వీ ఓవరాల్ చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకోగా, అండర్ –14 బాలుర విభాగంలో.. విశాఖపట్నం క్లస్టర్, బాలికల్లో కోలార్ క్లస్టర్, అండర్ –17 బాలుర విభాగంలో విశాఖపట్నం, బాలికల్లో కోలార్ క్లస్టర్, అండర్ –19 బాలుర విభాగంలో మహబూబ్‌నగర్, బాలికల్లో విశాఖపట్నం క్లస్టర్లు ప్రథమస్థానంలో నిలిచి త్వరలో జరగనున్న జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు అర్హత సాధించాయి. ప్రథమ స్థానంలో నిలిచిన ఒక్కో జట్టుకు 12 మంది చొప్పున మొత్తం 72 మంది జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



గుంటూరు పోలీస్ పరేడ్ మైదానంలో గురువారం జరిగిన స్వాతంత్య్ర వేడుకల్లో మంత్రి నారా లోకేష్ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న ఏసీబీ ఏఎస్పీ సుప్రజ. పక్కన కలెక్టర్ నాగలక్ష్మి, ఐజీ త్రిపాఠి



ప్రకార్‌జైన్, సబ్ కలెక్టర్, తెనాలి | ఎం.గంగరాజు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ | లక్ష్మీకుమారి, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ | పి.శ్రీకర్, ఆర్డీవో | కె.రాజ్యలక్ష్మి, అడిషనల్ కమిషనర్, జీఎంసీ | షేక్ కరీం, డీటీడీసీ | టి.బిమల్‌కుమార్, జిల్లా సమాచార శాఖ అధికారి | శైలజ, జిల్లా విద్యా శాఖ అధికారి | కోమలి పద్మ, డీఎస్‌ఓ | పి.ఉమాదేవి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారి | రఘు, జిల్లా ఉపాధి కార్యాలయ అధికారి



ఎం.శిరీష, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ | పి.వేణుగోపాల్, హౌసింగ్‌శాఖ పీడీ, | డాక్టర్ బి.లక్ష్మీనారాయణ, జిల్లా న్యూక్లియర్స్ మెడికల్ అధికారి | డాక్టర్ సుబ్బరాజు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి | డాక్టర్ సుబ్బరాయిణం, జిల్లా మలేరియా అధికారి | మహబూబ్ బాష, డీఎస్పీ | రత్నస్వామి, రిటైర్డ్ డీఎస్పీ | పోతురాజు, రిటైర్డ్ డీఎస్పీ | వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ | సుబ్బారావు, హెడ్ కానిస్టేబుల్ | పోతురాజు, హెడ్ కానిస్టేబుల్

ప్రతిభకు పురస్కారం

జిల్లాలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు ప్రశంసాపత్రాల ప్రదాన కార్యక్రమానికి గుంటూరు పోలీసు కవాతు మైదానం వేదికగా నిలిచింది. గురువారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జెండా వందన కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి నారాలోకేష్ అధికారులకు ఈ ప్రశంసా పత్రాలను స్వయంగా అందించారు. ఆయనతోపాటు కలెక్టర్ నాగలక్ష్మి ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు. –గుంటూరు



ఎన్.సదాశివరావు, నాట్కో ట్రస్టు వైస్‌చైర్మన్



సుబ్రహ్మణ్యం రాజు, వైద్య విధాన పరిషత్ జిల్లా కో ఆర్డినేటర్ | డాక్టర్ అన్నపూర్ణ, డెప్యూటీ డీఎంహెచ్‌ఓ | ఎల్.శ్రీనివాసరావు, గుంటూరు నర్సింగ్ కాలేజీ, సీనియర్ అసిస్టెంట్ | బి.రాధిక, మేనేజర్, స్టెప్ | సాంబశివరావు, జిల్లా సర్వేయర్ | హనుమంతరావు, సీనియర్ అసిస్టెంట్ ఆర్డీవో కార్యాలయం | పి.వి.నాగేశ్వరరావు, ఎస్ఆర్వో ఫిరంగిపురం | మేగిలి శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం



జవహర్, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా డీజీఎం | కె.ప్రమోద్‌కుమార్‌రెడ్డి, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ చైర్మన్ | విజయలక్ష్మి, అసిస్టెంట్, డీఈఓ కార్యాలయం | బాష, కంప్యూటర్ ఆపరేటర్, డీఈఓ కార్యాలయం | పవన్, అటెండర్, డీఈఓ కార్యాలయం | మల్లిఖార్జున, సీనియర్ అసిస్టెంట్, పంచాయతీరాజ్ | పద్మసాయి, సీనియర్ అసిస్టెంట్, అక్కౌంట్స్ విభాగం, కలెక్టర్ ఆఫీస్ | రిజ్వాన్ డిప్యూటీ ఎమ్మార్వో | హనుమంతరావు, అసిస్టెంట్, ఆర్డీఓ, ఆఫీస్ | శ్రీనివాస్, ఈఈ, జీఎంసీ | మురళి, ఏసీపీ, జీఎంసి | ఆనంద కుమార్, శానిటరీ సూపర్‌వైజర్ | షేక్ రిజ్వాన, ఎస్ఈ, విద్యాశాఖ | శ్రీనివాసకుమార్, జాయింట్ కమిషనర్, కార్మికశాఖ

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



నగరంపాలెం: పోలీస్‌పెరేడ్ గ్రౌండ్స్‌లో గురువారం జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. భారతదేశ గొప్పతనాన్ని చాటిచెప్పేలా విధంగా ప్రదర్శించిన విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. వినరండి చిట్టితమ్ముల్లారా అంటూ శ్రీ వెంకటేశ్వర బాలకుటీర్ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆహుతులను అలరించాయి. ఐదారు నిమిషాల గీతంలో దేశస్వాతంత్ర్య కోసం పోరాడిన స్వాతంత్ర సమరయోధుల వేషధారణలతో కళ్లకు కట్టినట్లు చూపించారు. బ్రిటిష్‌వాదుల నుంచి దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చేందుకు పోరాడిన పటిమను ప్రదర్శించారు. పాతగుంటూరు యాదవ ఉన్నత పాఠశాల విద్యార్థులు పుణ్యభూమి నా దేశం అంటూ గీతానికి ఆలపించారు. అదే విధంగా సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మనదేశం మన భారతదేశం అంటూ నృత్యాలు చేశారు. ఇక ప్రభుత్వ శాఖల శకటాలు ప్రదర్శనగా బయలుదేరాయి. అన్న క్యాంటీన్లు, పశుసంవర్ధక శాఖ, వ్యవసాయ, వైద్య, విద్యా, అగ్నిమాపక ఇతరత్రా శాఖల వాహనాలు వరుసగా రావడంతో వాటిని సెల్‌ఫోన్లల్లో బంధించేందుకు నగర వాసులు ఆసక్తి చూపారు. శకటాలలో రవాణా శాఖకు ప్రథమ, అగ్నిమాపక శాకకు ద్వితీయా, విద్యాశాఖకు తృతీయ బహుమతి లభించింది.

పేలవంగా దుకాణాలు..

మైదానంలో తాత్కాలిక ప్రభుత్వ శాఖల దుకాణాలు వీక్షించేందుకు సందర్శకులు, నగర వాసులకు అవకాశం లేకుండా పోయింది. మంత్రి నారా లోకేష్ సందర్శించే వరకు దుకాణాల వద్దకు ఎవర్నీ అనుమతించలేదు. దుకాణాల వద్ద పోలీసుల పహారా ఏర్పాటు చేశారు. ఒక్కొక్క స్టాల్ వద్ద సివిల్‌లో కానిస్టేబుళ్లు విధులు నిర్వర్తించారు. దీంతో ఎండ వేడిమికి తట్టుకోలేక చాలామంది అక్కడి నుంచి వెళ్లిపోయారు. సుమారు 11.30 తర్వాత మంత్రి నారా లోకేష్ దుకాణాలను సందర్శించారు. ఆయా శాఖల ప్రాధాన్యతను ప్రభుత్వ ఉద్యోగులు మంత్రి లోకేష్ దృష్టికి తీసుకొచ్చారు. మంత్రి లోకేష్ దుకాణాలు సందర్శించి వెళ్లాక దుకాణాలు వెలవెలబోయాయి. దీంతో ఆ దుకాణాలను కేవలం మంత్రి లోకేష్ మెప్పు కోసం ఏర్పాటు చేసినట్లుగా మారిందని పలువురు వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు గళ్ళా మాధవి, మహమ్మద్ నసీర్, తెనాలి శ్రావణ్ కుమార్, బూర్ల రామాంజనేయులు, ఎమ్మెల్సీలు చంద్రగిరి ఏసురత్నం, కె.ఎస్.లక్ష్మణరావు, గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మీ, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ్, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, తెనాలి సబ్ కలెక్టర్ ప్రకార్‌జైన్, డిప్యూటీ మేయర్ షేక్.సజీల తదితరులు పాల్గొన్నారు.

వేడుకల్లో లోపించిన సమన్వయం



వేదిక వద్దకు వెళ్లకుండా జనాలను అడ్డుకుంటున్న పోలీసులు



అధికారిని నిలువరించి వివరాలు అడుగుతున్న పోలీసులు



వేడుకలకు హాజరైన వారిని ప్రశ్నిస్తున్న పోలీసులు

- ప్రజలకు ఇబ్బందులు
- పోలీసుల అత్యుత్సాహం
- అరకొరగా మౌలిక వసతుల కల్పన

గుంటూరు వెస్ట్: 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా గురువారం స్థానిక పోలీసు పెరేడ్‌గ్రౌండ్‌లో జరిగినప్పటికీ కొన్ని శాఖల అధికారులు అత్యుత్సాహంతోపాటు, సమన్వయ లోపం ప్రజలకు తీవ్ర ఇబ్బందులను కలిగించింది. ముఖ్యంగా జెండా ఆవిష్కరణకు మంత్రి నారా లోకేష్ హాజరు కావడంతో జిల్లా రెవెన్యూ యంత్రాంగం ఎక్కడలేని హడావిడి చేయడంతో ప్రజలకు, చిన్నారులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఇటువంటి కార్యక్రమ ఏర్పాట్లకు గత పదిరోజులుగా అధికారులు సమీక్షలు, సమావేశాలు నిర్వహించినప్పటికీ రెవెన్యూ, పోలీసు శాఖ మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనబడింది. మైదానం ప్రధాన ద్వారం వద్ద కేవలం లోకేష్ కోసమని, మిగతావారందరినీ ఆపేశారు. అక్కడ సుమారుగా 50కు పైగా పోలీసులు మోహరించారు. ఒక దశలో జిల్లా అధికారులను ప్రశంసా పత్రాలు స్వీకరించేందుకు వచ్చిన వారిని కూడా అనుమతించ లేదు సరికదా కొందరు పోలీసుల నోటిదురుసు చాలా మందిని బాధించింది. ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండని మరింత దురుసుగా ప్రవర్తించడం మీడియాను సైతం ఆగ్రహానికి గురిచేసింది.

ఎవరికి కోసం ఈ స్టాల్స్ ?

గత సాంప్రదాయానికి భిన్నంగా, ఈసారి వివిధ ప్రభుత్వ శాఖల స్టాల్స్ మైదానం పోలీసు జిమ్ ప్రాంతం ముందు ఏర్పాటు చేశారు. అయితే ప్రజలను గానీ, విద్యార్థులను గానీ, చూడనివ్వకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. కారణం ఏమిటని ప్రశ్నిస్తే తమ నాయకుడు నారా లోకేష్ వచ్చి చూసేంత వరకు ప్రజలకు అనుమతి లేదని పోలీసులు అక్కడ పహారా కాశారు. తీరా కార్యక్రమం అంతా ముగించుకుని వెళ్లేముందు నారా లోకేష్ రావడంతో ఆ తరువాత ప్రజలంతా వెనక్కు తిరిగి వెళ్లిపోయారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకలు కేవలం ఒక నాయకుడి చుట్టూ తిరగడం ఏమిటని మరికొందరు ప్రశ్నిస్తున్నారు. కనీసం అధికారులకు చిత్తశుద్ధి లేకుండా తమ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించడం, ప్రజలతో దురుసుగా వ్యవహరించడం గతంలో ఎప్పుడూ చూడలేదని పేర్కొన్నారు.

కొరవడిన మౌలిక వసతులు

ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాల సమయంలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కనీసం కొందరు చిన్నారులకు తాగేందుకు మంచినీరు కానీ, కూర్చోవడానికి ఏర్పాట్లు కానీ సరిగ్గా లేవు. దీంతోపాటు, పార్కింగ్‌ను ఎలా ఏర్పాటు చేశారో, అక్కడకు వచ్చిన అధికారులకే అర్థం కాకుండా ఉంది. ఉన్నత విద్యనభ్యసించే అధికారులు ఇంత ముఖ్యమైన కార్యక్రమాన్ని అవగాహన లోపంతో నిర్వహించడం సరికాదని స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు అభిప్రాయపడ్డారు.

వేదికపై ప్రజాప్రతినిధులు!



స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా ఇన్‌చార్జి మంత్రికి మాత్రమే కూర్చునే అవకాశం ఉంటుంది. సదరు మంత్రితోపాటు, జిల్లా ఉన్నతాధికారులు వేదికపై కూర్చొంటారు. ఎప్పటి నుంచో ఇదే ఆనవాయితీ నడుస్తుంది. కానీ దానికి విరుద్ధంగా లోకేష్‌తో పాటు, జిల్లాలో శాసనసభ్యులు వేదికపై కూర్చొవడంతోపాటు, ప్రశంసా పత్రాలు అందించే సమయంలోనూ ఫొటోల్లో కనిపించడం మాకే కొత్తగా ఉందని ఓ జిల్లా అధికారి వ్యాఖ్యానించారు. పార్టీలు వస్తుంటాయి, పోతుంటాయి. స్వాతంత్ర దినోత్సవం లాంటి ముఖ్యమైన కార్యక్రమాల్లో ఆనవాయితీలు మరిచిపోతే ఎలా అని కొందరు పేర్కొనడం గమనార్హం.

అమరవీరుల త్యాగాల ఫలితంగానే స్వాతంత్ర్యం

పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్, ఈడీ శ్రీధర్

కొరిటెపాడు(గుంటూరు): ఎందరో అమరవీరుల త్యాగాల ఫలితంగానే స్వాతంత్ర్యం వచ్చిందని, వాటి ఫలాలను పరిరక్షించు కోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని భారత పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్, బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబులు పేర్కొన్నారు. జీటీ రోడ్‌లోని పొగాకు బోర్డు ప్రధాన కార్యాలయంలో గురువారం 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించారు. జాతీయ పతాకాన్ని చైర్మన్ యశ్వంత్‌కుమార్ ఆవిష్కరించారు. యశ్వంత్ కుమార్, శ్రీధర్‌బాబులు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఫలాలు పేదలకు అందించినప్పుడే ఉద్యమవీరుల త్యాగం సార్థకం అవుతోందన్నారు. ప్రతిఒక్కరూ తమ బాధ్యతలు, విధులను నిర్వర్తించి దేశ పురోభివద్ధికి తోడ్పడాలని ఆయన కోరారు. పొగాకు బోర్డులో అందరి సమిష్టి కృషి, టీంవర్క్ ఫలితంగా పొగాకు వేలం అమ్మకాలను విజయవంతంగా నిర్వహించగలిగామని తెలిపారు. భారత ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి పొగాకు బోర్డు ఉద్యోగులు, వ్యాపారులు, రైతులు తమ తమ విధులను ఘనంగా నిర్వహించారని కొనియాడారు. ప్రతిఒక్కరూ దేశం, దేశభక్తికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. 78 సంవత్సరాల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల జ్ఞాపకార్థం, పొగాకు బోర్డు ప్రధాన కార్యాలయం ఆవరణలో ఇంటర్, పదవ తరగతిలలో అత్యధిక మార్కులు సాధించిన పొగాకు బోర్డు సిబ్బంది సభ్యులకు బహుమతులను అందజేశారు. అంతేకాకుండా బోర్డు సిబ్బందికి మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు కార్యాలయాల్లో జెండావందనం



ఐజీ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న ఐజీ సర్వశ్రేష్ఠ తిపాఠి



డీపీఓలో జెండా ఎగురువేస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: ఎందరో మహానుభావులు, స్వాతంత్ర్య సమరయోధుల పోరాటం ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం లభించిందని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి అన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు గురువారం గుంటూరు నగరంలోని రేంజ్ ఐ.జి కార్యాలయంలో జరిగాయి. రేంజ్ ఐజీ జాతీయ పతాకావిష్కరణ చేశారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి మిఠాయిలు అందించారు. జిల్లా ఏఎస్పీ (ఏఆర్) హనుమంతు, డీఎస్పీ (ఏఆర్) శాంతకుమార్, ఆర్ఐలు శ్రీనివాసరావు, శ్రీహరిరెడ్డి, బ్రహ్మానందం, మినిస్టరియల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో..

జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిగాయి. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం మిఠాయిలు అందించారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీలు నిచికేత్ షెల్కే (గుంటూరు తూర్పు), జీవీ.రమణమూర్తి (పరిపాలన), ఎ.శ్రీనివాసరావు (క్రైం), హనుమంతు (ఏఆర్), ఏఆర్ డీఎస్పీ శాంతకుమార్, ఎస్‌బీ సీఐ ఆనంద్, ఆర్ఐలు శ్రీనివాసరావు, హరిరెడ్డి, బ్రహ్మానందం పాల్గొన్నారు.

పరేడ్ గ్రౌండ్‌లో డ్రోన్ కలకలం

- అనుమతులు లేకుండా డ్రోన్ ఎగురవేసిన మహిళ
- ఒక్కసారి అలజడి
- స్టేషన్ తరలించి విచారించిన పోలీసులు
- యూట్యూబర్ అని తేల్చి పంపించిన నగరంపాలెం పోలీసులు

పట్నంబజారు: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఒక యూట్యూబర్ ఎటువంటి అనుమతులు లేకుండా చేసిన పని కలకలం రేపింది. పోలీసు పేరేడ్ గ్రౌండ్స్‌లో గురువారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిగిన విషయం విదితమే. ఈ క్రమంలో నందిని అనే ఓ యూట్యూబర్ ఎటువంటి అనుమతులు లేకుండా పేరేడ్ గ్రౌండ్స్‌లో స్వాతంత్ర్య వేడుకలు చిత్రీకరించేందుకు డ్రోన్ వినియోగించింది. దీంతో అధికారులు, సిబ్బంది ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. గ్రౌండ్స్‌లో అలజడి వాతావరణం ఏర్పడింది. వీఐపీలు అధికంగా ఉన్న వేళ అనుమతులు లేకుండా నందిని డ్రోన్ ఎగురువేసిన నేపథ్యంలో పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని డ్రోన్ స్వాధీనం చేసుకున్నారు. నగరంపాలెం పోలీసుస్టేషన్ తరలించి విచారించారు. అనంతరం ఆమె యూట్యూబర్ అని తెలుసుకుని, అనుమతులు లేకుండా ఇటువంటి కార్యక్రమాలు చిత్రీకరించకూడదని సూచించి పంపించివేశారు. నందిని తండ్రి బొల్లాపల్లి ఏఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు.